క్లుప్తంగా

వీధి కుక్కల సర్వేపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వీధి కుక్కల సర్వేపై వెటర్నరీ డాక్టర్ శిరీష వార్డు అధికారులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని వీధి కుక్కలున్నాయి, వ్యాక్సినేషన్ అయిన కుక్కలను ఎలా గుర్తించాలి.. రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రాయికోడ్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, రవీందర్, కిషోర్‌బాబు, చంద్రశేఖర్, నగేష్, బీరయ్య, మంజుల, శ్రీనివాసమ్మ, గోదావరిలను ప్రధానోపాధ్యాయుడు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుల జ్ఞాపకాలు, వారి సేవల గురించి వివరించారు.

గోతుల పూడ్చివేత



పనులను పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్, కమిషనర్

నారాయణఖేడ్: స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా బుధవారం ఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్డుకు ఏర్పడ్డ గోతులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకట శివయ్యలు పనులను పర్యవేక్షించారు. అలాగే స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు తమ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత, వీధి కుక్కల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శానిటరీ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పలు వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్, నిల్వ ఉన్న నీటిలో లార్వా నివారణకు రసాయనాలను చల్లారు.

రక్షణ చట్టం అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్: న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం ధర్నా నిర్వహించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్ : ధరణి ప్రజావాణి దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ క్రాంతి అన్నారు. బుధవారం అధికారులతో కలిసి ఆమె కలెక్టరేట్‌లో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ జరిపి సంబంధిత దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన కోసం అదనపు బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, సమస్యలను తొందరగా పరిష్కరించాలన్నారు.

పౌష్టికాహారం అందించాల్సిందే..

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర పాఠశాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పౌష్టికాహారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు

- జోగిపేట, వట్‌పల్లి, రాయికోడ్ చైర్మన్ పదవులు..
- మంత్రి ఆశీస్సుల కోసం ఆశావహుల యత్నాలు

జోగిపేట, వట్‌పల్లి, రాయికోడ్ మార్కెట్ కమిటీల నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలు, ముఖ్యులను కలుస్తున్నారు. కాగా, పార్టీకి అండగా ఉండి, పదేళ్లు వెన్నుదన్నుగా ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నట్లు తెలిసింది. ఆశావహుల అధికంగా ఉండటంతో అంతా కూర్చోని ఒకరి పేరు సిఫారసు చేయాలని చెప్పినట్లు కూడా సమాచారం. మరి జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్చీ ఉత్కంఠకు తెరపడాలంటే కొద్ది రోజులు వేచిచూడాల్సిందే.



జోగిపేట మార్కెట్ కార్యాలయం

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉండటంతో నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవులపై దృష్టి సారించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పదవులకు రిజర్వేషన్లు కేటాయించింది. దీంతో ఈసారి జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి దక్కనుంది. బీఆర్ఎస్ హయాంలో ఎస్సీలకు రిజర్వుడ్ చేశారు. తర్వాత రాజకీయ పరిణామాల మధ్య చౌటకూరు మండలం గొంగ్లూర్‌కు చెందిన పల్లె సంజీవయ్యను నియమితులై కేవలం మూడు మాసాల పాటు పని చేశారు. రిజర్వేషన్ కేటాయింపులతో ఆశావాహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కాగా, నూతన ప్రభుత్వం పాత మార్కెట్ కమిటీలను రద్దు చేయడం తెలిసిందే.

ప్రయత్నాలు

జోగిపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి కోసం అందోల్, పుల్కల్ మండలాలకు చెందిన నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో అందోల్, పుల్కల్, టేక్మాల్ మండలాలు వస్తాయి. అందోల్ మండల నేతలు ఎక్కువగా చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. గణపతి షుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ ఎం.జగన్మోహన్‌రెడ్డి (నేరడిగుంట), జీఆర్.మధుసూదన్‌రెడ్డి (డాకూరు), అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ జి.నరేందర్‌రెడ్డి (డాకూరు), మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి (నేరడిగుంట), మాజీ మార్కెట్ చైర్మన్ ఎం.పద్మనాభరెడ్డి (మన్‌సాన్‌పల్లి), దుర్గారెడ్డి (ముదిమాణిక్యం)లు పోటీ పడుతున్నారు. అయితే జోగిపేటకు చెందిన నాయకులు పదవీని ఆశించడం లేదని తెలిసింది.

వట్‌పల్లి, రాయికోడ్‌లలో..

నియోజకవర్గం పరిధిలోని వట్‌పల్లి మార్కెట్ కమిటీ, రాయికోడ్ ఏఎంసీ పదవుల కోసం స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా ప్రయత్నాలు జరుపుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి, పదేళ్లుగా వెన్నుదన్నుగా ఉన్న వారికే పదవులను కేటాయిస్తామని మంత్రి ప్రకటించడంతో సీనియర్ పార్టీ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. రాయికోడ్ మార్కెట్ పరిధిలోకి మునిపల్లి మండలం కూడా వస్తుంది. ఈసారి ఈ మండలానికి చైర్మన్ పదవిని కేటాయించనున్నారు. మండల కేంద్రానికి చెందిన సుధాకర్‌రెడ్డి (మునిపల్లి), రాయికోడ్ మాజీ జెడ్పీటీసీ అంజయ్య కూడా ప్రయత్నిస్తున్నారు. వట్‌పల్లి మార్కెట్ పదవిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ జ్యోషి, సీనియర్ నాయకుడు కిషన్‌లతో పాటు పలువురు ఆశిస్తున్నారు.

మంత్రికి సమస్యగా మారిన ఎంపిక ప్రక్రియ

మంత్రి దామోదర్ రాజనర్సింహ సొంత నియోజకవర్గంలోని మార్కెట్ చైర్మన్ పదవులకు అభ్యర్థుల ఎంపిక సమస్యగా మారనుంది. నేతల మధ్య పోటీ అధికంగా ఉంది. దీంతో జోగిపేట చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారందరూ కూర్చొని ఒక పేరును ఎంపిక చేసి తనకు సూచించాలని మంత్రి చెప్పినట్లుగా తెలిసింది. పదేళ్లుగా అధికారంలో లేని కారణంగా సీనియర్ నేతలు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. అయితే ఈ పదవులకు ఎవరిని ఎలా ఎంపిక చేస్తారోననే ఉత్కంఠ అందరిలో నెలకొంది.

సైబర్ సెక్యూరిటీకి ప్రాధాన్యం

- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్



సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ గోయల్

పటాన్‌చెరు టౌన్: సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐడీ అదనపు డీజీపీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో అత్యాధునిక సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను బుధవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ల్యాబ్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ అభివృద్ధికి గణనీయంగా దోహదపడగలదని విశ్వాసం వెలిబుచ్చారు. నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పారు. సంచలనాత్మక పరిశోధన ప్రాజెక్టులు, కన్సల్టెన్సీ సేవల కోసం ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బీటెక్ తొలి ఏడాది విద్యార్థులతో కలిసి ఆమె ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత సైబర్ సెక్యూరిటీ పరిజ్ఞాన సముపార్జనతో పాటు పరిశోధనల్లో సామర్థ్యాలను మెరుగు పరచడానికి ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు గీతం అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కోర్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, పలు విభాగాధిపతులు, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను అప్పగించండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: హోతి(కె)వద్ద కట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని సీపీఎం నియోజకవర్గం కార్యదర్శి మహిపాల్ కోరారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం నాయకులు పట్టణంలోని బాగారెడ్డిపల్లి, వడ్డెర కాలనీ, శాంతినగర్‌లో పర్యటించారు. అధికారులు తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించడంలేదని లబ్ధిదారులు నాయకుల ముందు వాపోయారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం హోతి(కె) వద్ద ఇళ్లను కట్టించి డ్రా తీసి లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందన్నారు. అసంపూర్తిగా ఇళ్లు ఉన్నందున లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. నిర్మాణం పనులు పూర్తి అయినందున వెంటనే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని అధికారులను కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీమొద్దీన్, శాంతమ్మ యాదుల్‌లు ఉన్నారు.

గిరిజన దినోత్సవానికి రండి

- మంత్రి దామోదరకు ఆహ్వానం



మంత్రికి దామోదరను ఆహ్వానిస్తున్న గిరిజన నాయకులు

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో 9వ తేదీన జరిగే అంతర్జాతీయ గిరిజన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంత్రికి ఆహ్వానపత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూల్ సింగ్ నాయక్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద రెడ్డి, జిల్లా నాయకులు దినేశ్ నాయక్, బాబులాల్ నాయక్ , శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు నాయక్



మాట్లాడుతున్న రాములు నాయక్

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేసుకొని ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సువిన్ ఫార్మా పరిశ్రమ ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో కార్మికులు నాలుగు రోజులుగా నిరసన చేపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న రాములు నాయక్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించగా, వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే కార్మికుల సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక కర్షక కాంగ్రెస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజు ముదిరాజ్, ట్రెజరీ సత్యనారాయణరెడ్డి, అడ్వైజర్ ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశం యాదవ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం



కంగ్టి: గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): అమ్మపాలు బిడ్డల పాలిట అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత తెలిపారు. బుధవారం తడ్కల్‌లోని అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లులు పిల్లలకు డబ్బాపాలు తాగించవద్దని ఆరు నెలల పాలు తల్లి పాలు తాగించడంతో పాటు పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కాగా, ఐదు నెలల గర్భిణులకు సీమంతం కార్యక్రమం చేశారు. గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం

హత్నూర(సంగారెడ్డి): బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం హత్నూరలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలను తాగించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించరూ..

సదాశివపేట(సంగారెడ్డి): కృష్ణనగర్ కాలనీ ఏర్పడి దాదాపు ఇరవై ఏళ్లు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని సీపీఐ పట్టణ కార్యదర్శి పీ.వినోద పేర్కొన్నారు. బుధవారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 8వ వార్డులోని హనుమాన్‌నగర్ కాలనీలో ప్రజాసమస్యల గురించి సర్వే చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్ ఉమకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో బురదమయమైన రోడ్లపై అధికారులు కంకర, మొరం వేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వీధి దీపాలు, మురుగు నీటి కాల్వల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాజోద్దీన్, షఫీ, నాయకులు ఉమేశ్, ఫయాజ్, దుర్గయ్య, పోచయ్య, షేహనాజ్‌బేగం, కుర్షిద్‌బేగం కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మెసేజ్‌లకు స్పందించొద్దు

జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అపరిచిత వ్యక్తుల మెసేజ్‌లకు స్పందించి, సైబర్ వలలో పడొద్దని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. బుధవారం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ కృష్ణవేణి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. క్రెడిట్‌కార్డ్, డెబిట్ కార్డ్ అప్‌డేట్ చేయాలని.. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని అన్నారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు, లింక్‌లకు స్పందించకూడదని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ రవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి పెద్దపీట

పచ్చదనం కాపాడుకోవడం అందరి బాధ్యత అని, మనిషి మనుగడకు చెట్లు, చేమలే మూలమని వక్తలు అన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో మొక్కలను నాటారు. వాటర్ ట్యాంకులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పరిశుభ్రతను పరిశీలించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. ఎక్కడైతే పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్



నారాయణఖేడ్: తుర్కపల్లిలో మొక్కనాటి నీరు పోస్తున్న డీఎఫ్ఓ



కంగ్టి: దెగుల్‌వాడిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సత్తయ్య తదితరులు



దుకాణదారులకు పలు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ పుష్ప



సంగారెడ్డి : మొక్కలు నాటుతున్న నిర్మల

ఖేడ్‌లో భారీవర్షం

నారాయణఖేడ్: ఖేడ్‌లో బుధవారం సాయంత్రం గంటపాటు వర్షం కురిసింది. పలుచోట్ల మురుగుకు వరద తోడై డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రాజీవ్ కూడలి చుట్టూ జలమయమైంది. రోడ్డుపై పేరుకుపోయిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.



రాజీవ్ చౌక్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

సంక్షిప్త వార్తలు

◆ **సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం**

మునిపల్లి(అందోల్): రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు పెద్దచల్మెడ మాజీ ఎంపీటీసీ రాధాబాయి జ్యోషి క్షీరాభిషేకం చేశారు. బుధవారం పెద్దచల్మెడలో తాజా మాజీ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు.

◆ **రోడ్డు పనుల ప్రారంభం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) చంద్రశేఖర్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎంపీ రఘునందన్ రావు కొద్ది రోజుల క్రితం అధికారుల దృష్టికి తీసుకొచ్చిన మైఫెయిర్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే రోడ్డుకు మరమ్మతు పనులను ప్రారంభించారు. అనంతరం తెల్లాపూర్‌లోని మేళ్లచెరువు పరిసర ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు.

◆ **శుభకార్యాలకు అద్దెకు బస్సులు..**

నారాయణఖేడ్: వివాహాది శుభ కార్యాలు, విహార యాత్రల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 10 శాతం రాయితీతో అతి తక్కువ ధరకే అద్దెకు ఇస్తామన్నారు. ఇందులో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు ఉంటాయన్నారు. అద్దె బస్సుల బుకింగ్, ఇతర వివరాలకు 96766 67703, 73828 30651, 94410 71134 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

◆ **విధులు బహిష్కరించి నిరసన**

నారాయణఖేడ్: జనగామలో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టుకు సంబంధించిన న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ నినదించారు. సీనియర్ న్యాయవాదులు నర్సారెడ్డి, చంద్రశేఖర్‌రావు, ఎ.లక్ష్మణావు, నర్సింహారావు పాల్గొన్నారు.

◆ **రేపు సెట్విన్ చైర్మన్‌గా గిరిధర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం**

జహీరాబాద్: మాజీ ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్ రెడ్డి ఈనెల 9వ తేదీన సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రెనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి హాజరు కావాలని పలువురు మంత్రులు, నాయకులకు గిరిధర్‌రెడ్డి ఆహ్వానాలు పంపారు.

◆ **సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన**

పటాన్‌చెరు టౌన్: ప్రతీఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు ఏఎస్ఐ అక్బర్ ఖాన్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామన్నారు. క్రెడిట్ కార్డ్ అప్డేట్ చేయాలని, పార్ట్‌టైం జాబ్‌ల పేరిట, అధిక లాభాలు ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాల నియంత్రణ చర్యలను ప్రజలకు వివరించారు.

◆ **విద్యార్థుల అభ్యున్నతికి టీఎస్‌కేసీ దోహదం**

పటాన్‌చెరు టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు టీఎస్‌కేసీ ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్) ద్వారా ఉమీద్ మహిళా సాధికారత సహకారంతో రెండు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళా విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేశారు.

◆ **చేనేత సంక్షేమానికి కృషి చేయాలి**

సదాశివపేట(సంగారెడ్డి): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని చేనేత సహకార సంఘం మేనేజర్ చిల్వెరి వెంకటేశం, ఉపాధ్యక్షుడు గడీల గణేశం, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథంలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని సంఘం సభ్యులు, పద్మశాలీ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ రంగం కార్మికులను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

నారాయణఖేడ్: ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని మార్కండేయ భవన్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మశాలీలు మార్కండేయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీల సంఘం బాధ్యులు బషెట్టి, అనంతం, శ్రీనివాస్, నర్సింహులు, పండరి, గుండు శివకుమార్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం రాజ్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు.

◆ **బాధ్యతల స్వీకరణ**

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి నూతన గిర్దావార్‌గా మల్లేశ్వర్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కంగ్టిలో గిర్దావార్‌గా విధులు నిర్వహించిన లక్ష్మణ్ సికింద్రాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా తహసీల్దార్ ఎస్.బీ. విష్ణుసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో డీటీ మహ్మద్ జుబేర్ అహ్మద్, సిబ్బంది వినోద్, రాహుఫ్, గుండు మోహన్, మాణిక్యం, సాయులు, సంజీవ్, సాగర్, శంకర్, శ్రీను, కృష్ణ పాల్గొని సన్మానించారు. నూతనంగా విధుల్లో చేరిన మల్లేశ్వర్‌రెడ్డికి స్వాగతం పలికారు.

◆ **తారా కళాశాల పరిశీలన**

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలను బుధవారం ఎన్సీసీ కమాండింగ్ ఆఫీసర్ రమేశ్ సూర్యాల్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎన్సీసీ విభాగం అభివృద్ధిని, విజయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్సీసీ క్యాడెట్లు భవిష్యత్‌లో అన్ని జాతీయ స్థాయి క్యాంపుల్లో పాల్గొనేలా చూడాలని డాక్టర్ విజయను కోరారు.

◆ **తీజ్ సందడి**

నారాయణఖేడ్: మండలంలోని ఆకలాయితండాలో తండా గోర్‌సేన ఆధ్వర్యంలో బుధవారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ఏటా శ్రావణ మాసంలో పది రోజుల పాటు తీజ్ వేడుకలను నిర్వహిస్తుంటారు. ఈనెల 15వ తేదీ వరకు వేడుకలు కొనసాగనున్నాయి.